సాక్షి సూర్యాపేట

ఆదివారం । 14 । జూలై । 2024



వస్త్ర నిల్వలు కొనుగోలు చేయాలి

చేనేత వస్త్రనిల్వలను ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని ఓయూ రిటైర్డ్ ప్రొఫెసర్ శ్రీనివాసులు కోరారు. - 8లో



140 కిలోల గంజాయి స్వాధీనం

మిర్యాలగూడలో రూ.35లక్షల విలువైన 140 కేజీల గంజాయిని తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. - 10లో

గరిష్టం / కనిష్టం
29 / 25°

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

రేపు ఫుట్‌బాల్ బాలికల జట్టు ఎంపిక

నల్లగొండ టూటౌన్: జూనియర్ బాలికల రాష్ట్ర ఫుట్‌బాల్ జట్టు సెలక్షన్ ట్రయల్స్ ఈనెల 15న నిర్వహిస్తున్నట్లు ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మపాల గిరిబాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 15వ తేదీన సిద్దిపేటలోని పీజీ హాస్టల్ గ్రౌండ్‌లో బాలికల జట్టు ట్రయల్స్ నిర్వహిస్తారని, 01-01-2008 నుంచి 31-12-2010 మధ్య జన్మించిన వారు ఆధార్‌కార్డు, జనన ధ్రువీకరణపత్రం, రెండు ఫొటోలతో హాజరు కావాలని సూచించారు. 14వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు రిపోర్ట్ చేయాలని, ఇతర వివరాలకు 9989484657 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

యాదాద్రిలో భక్తుల ఆరాధనలు



స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో శనివారం ఆరాధన పర్వాలు సంప్రదాయ రీతిలో కొనసాగాయి. వేకువ జామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు.. మూలవరులను మేల్కొలుపులో భాగంగా సుప్రభాత సేవ చేపట్టి నిజాభిషేకం, తులసీ అర్చన చేశారు. అనంతరం అష్టభుజి ప్రాకారంలో శ్రీసుదర్శన నారసింహహోమం, స్వామివారి కల్యాణోత్సవం, బ్రహ్మోత్సవం నిర్వహించారు. గజవాహనంపై కల్యాణమూర్తులను అలంకరించి సేవా పర్వాన్ని కనుల పండువగా జరిపించారు. మహాముఖ మండపంలో అష్టోత్తరం, సువర్ణపుష్పార్చన గావించారు. సాయంత్రం స్వామి, అమ్మవారి జోడు సేవలను మాడ వీధిలో ఊరేగించారు. వేడుకల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

● ఆషాఢం.. సంప్రదాయం

ఆషాఢ మాసం వచ్చిందంటే.. మగువలకు గుర్తొచ్చేది గోరింటాకు. చేతులకు గోరింటాకు పెట్టుకుని మురిసిపోతారు. మారుతున్న కాలానికి అనుగుణంగా పట్టణాల్లో సామూహికంగా గోరింటాకు ఉత్సవాలు జరుపుకుంటున్నారు. ఇక, గిరిజన తండాల్లో సీత్లా పండుగ సందడి కనిపిస్తోంది. సీత్లాభవాని అమ్మవారికి మొక్కులు చెల్లించుకుంటారు. పంటలు బాగా పండాలని, పశు సంపద చల్లగా ఉండాలని ఈ పండుగ జరుపుకోవడం గిరిజనుల ఆనవాయితీ. 8లో



గోరింటాకు ఉత్సవం



సీత్లాభవానికి నైవేద్యం సమర్పణ

స్విమ్మర్ క్వీనీ విక్టోరియాకు సన్మానం

రామన్నపేట : ఇటీవల ఇంగ్లండ్‌లోని ఇంగ్లిష్ చానల్‌ను ఈదిన తెలుగు మహిళ క్వీనీ విక్టోరియా గంధం శనివారం భువ నగిరి జిల్లా రామన్నపేటలోని జాయిన్‌గాస్పెల్ చర్చిని సందర్శించారు. చర్చిలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్నారు. చర్చి నిర్వాహకులు ఆమెను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో హెల్పింగ్‌స్టోన్ మినిస్ట్రీస్ చైర్‌పర్సన్ మేరీ జాన్, వైస్ ప్రెసిడెంట్ కొత్తపల్లి అబ్రహంకుమార్, కె.విజయా ఎలిజబెత్, కె.ఈస్టర్‌రాణి, గడ్డం పరిమళాజోసెఫ్ పాల్గొన్నారు.



క్వీనీ విక్టోరియాను సన్మానిస్తున్న చర్చి నిర్వాహకులు

మత్తులో ప్రమాదాల బారిన

గంజాయి సేవించి వాహనాలు నడుపుతున్న యువకులు

- జాతీయ రహదారులపై తరచూ యాక్సిడెంట్లు
- ఏడు నెలల్లో ఆరు ప్రమాదాలు.. ఆరుగురు మృతి
- పోలీసులు కౌన్సిలింగ్ ఇస్తున్నా యువతలో రాని మార్పు



ఈ చిత్రం ఈ ఏడాది మార్చి నెలలో సూర్యాపేట పట్టణంలోని ఖమ్మం క్రాస్ రోడ్డులో వెనుకనుంచి డీసీఎంను ఢీ కొట్టి నడిరోడ్డుపై నిలిచిన కారు. ఇందులో ప్రయాణిస్తున్న యువకులు గంజాయి సేవించి కారు నడపడంతో ఈ ప్రమాదం జరిగిందని పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ప్రమాదంలో ముగ్గురు యువకులు మృత్యువాతపడ్డారు.

సూర్యాపేట పట్టణ శివారులోని జాతీయ రహదారిపై రెండు నెలల క్రితం ఓ కారు ఓవర్ స్పీడ్‌తో వెళ్లి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతిచెందారు. మరో ముగ్గురు యువకులు తీవ్ర గాయాలపాలయ్యారు. గంజాయి మత్తులో కారు నడపడం వల్లే ఈ ఘటన జరిగిందని పోలీసులు నిర్ధారించారు. ఇలా.. చాలామంది యువత గంజాయి, మద్యం వంటి మత్తు పదార్థాలు సేవించి వాహనాలు నడపుతుండడంతో రోడ్డు ప్రమాదాలకు గురై ప్రాణాలు పోగొట్టుకుంటూ తల్లిదండ్రులకు తీరని శోకాన్ని మిగుల్చుతున్నారు.

సూర్యాపేట: గంజాయి, మద్యం మత్తులో యువత వాహనాలు నడపుతూ ప్రమాదాల బారిన పడుతోంది. ఈ ప్రమాదాల్లో కొందరు ప్రాణాలు కోల్పోతుండగా.. మరికొందరు కాళ్లు, చేతులు పోగొట్టుకుని అంగ వైకల్యం గలవారిగా మారుతూ కన్నవారికి కన్నీటి శోకం మిగుల్చుతున్నారు. సూర్యాపేట జిల్లా కేంద్రంతోపాటు కోదాడ, హుజూర్‌నగర్, తిరుమలగిరి, నేరుడుచర్ల, తుంగతుర్తి పరిసర ప్రాంతాల్లో గంజాయి వ్యాపారం చాప కింద నీరులా కొనసాగుతోంది. కొందరు అక్రమ వ్యాపారులు కొంతకాలంగా పోలీసుల కళ్లుగప్పి ఇతర ప్రాంతాల నుంచి గంజాయిని గుట్టుచప్పుడు కాకుండా తీసుకొచ్చి స్థానిక యువకులకు అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్నారు. గంజాయికి బానిసలైన యువకులు రాత్రి వేళల్లో చీకటి ప్రాంతాల్లో అమ్మకందారుల నుంచి కొనుగోలు చేసి విచ్చలవిడిగా తాగేస్తున్నారు. దీంతో జిల్లా వ్యాప్తంగా వందల సంఖ్యలో యువకులు ఇప్పటికే గంజాయికి బానిసలైనట్లు తెలుస్తోంది.

ఈ ఏడాది గంజాయి మత్తులో జరిగిన రోడ్డు ప్రమాదాలు	
జరిగిన ప్రమాదాలు	06
మృతిచెందిన వారు	06
క్షతగాత్రుల సంఖ్య	22
పోలీసుల కౌన్సిలింగ్ తీసుకున్నవారు	712

ఇష్టారీతిన వాహనాలు నడుపుతూ..

గంజాయికి అలవాటుపడిన యువకులు దాన్నే వ్యాపారంగా చేసుకుంటున్నారు. ఈ క్రమంలో ఇంటర్, డిగ్రీ, ఇంజినీరింగ్, మెడికల్ విద్యార్థులకు గాలం వేస్తున్నారు. దీంతో కొందరు విద్యార్థులు ప్రత్యేక తరగతుల పేరుతో ఇంట్లో నుంచి బయటికొచ్చి గంజాయి సేవించి మత్తులో వాహనాలు నడుపుతూ ప్రమాదాల బారిన పడుతున్నట్లు పోలీసుల తనిఖీల్లో బయటపడుతోంది. గంజాయి మత్తులో రాత్రి వేళల్లో రోడ్డుపై ట్రిపుల్ రైడింగ్, వాహనాలను ఇష్టారీతిన నడపడం, నడిరోడ్ల మీద వాహనాలు నిలుపుతూ ఇతరులకు ఇబ్బందులు కలిగిస్తున్నారు. మరికొన్ని చోట్ల ఏకంగా రహదారులపై నడుచుకుంటూ వెళ్తున్న వారిని అడ్డంగించి దాడిచేస్తుండడం భయాందోళన కలిగిస్తోంది. మత్తు కలిపిన గుట్కాలు తిని వాహనాలు నడుపుతున్న కొందరు యువకులు కూడా రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారు. సూర్యాపేటలో కేవలం గంజాయి సేవించడానికి గదులు అద్దెకు తీసుకుంటున్నారంటే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. మత్తులో డ్రైవింగ్ చేయొద్దని తాము నిత్యం కౌన్సిలింగ్ ఇస్తున్నా యువతలో మార్పు రావడం లేదని పోలీసులు అంటున్నారు.

కేసులు నమోదు చేస్తాం

గంజాయి సేవించేందుకు ప్రత్యేకంగా అద్దె గదులు తీసుకుంటున్నట్లుగా మా దృష్టికి రాలేదు. ఇంటి యజమానులు ఎవరైనా గంజాయి సేవించడానికి గదులు అద్దెకు ఇస్తే కేసులు నమోదు చేస్తాం. గంజాయి సరఫరా చేసినా.. విక్రయించినా చర్యలకు వెనుకాడేది లేదు. గంజాయి మత్తులో రైడింగ్‌లు చేస్తూ రహదారులపై జనానికి ఇబ్బందులు కలిగించే చర్యలు తప్పవు.

– జి.రాజశేఖర్, సీఐ, సూర్యాపేట

మట్టపల్లిలో న్యాయమూర్తుల పూజలు

మఠంపల్లి, మేళ్లచెరువు: మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంతోపాటు మేళ్లచెరువు మండలకేంద్రంలోని శ్రీఇష్టకామేశ్వరీ సమేత శ్రీస్వయంభు శంభులింగేశ్వర స్వామి దేవాలయంలో శనివారం రంగారెడ్డి జిల్లా మహేశ్వరం కోర్టు అదనపు జూనియర్ సివిల్ జడ్జి అపర్ణ, కోదాడ కోర్టు అదనపు జూనియర్ సివిల్ జడ్జి భవ్య కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయా ఆలయాల అర్చకులు, ధర్మకర్తలు ఆలయ మర్యాదలతో సాదరంగా స్వాగతం పలికారు. అనంతరం న్యాయమూర్తులు గర్భాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఆ తర్వాత న్యాయమూర్తులను శేషవస్త్రాలతో సత్కరించి ఘనంగా ఆశీర్వచనాలు అందజేశారు. ఈ కార్యక్రమాల్లో మట్టపల్లి ఆలయ కమిటీ చైర్మన్ చెన్నూరు మట్టపల్లిరావు దంపతులు, జిల్లా కోర్టు రెండవ అదనపు సూపరింటెండెంట్ తాటి విజయభాస్కర్‌రెడ్డి, హుజూర్‌నగర్ కోర్టు సూపరింటెండెంట్ పానుగోతు సైదానాయక్, అర్చకులు శ్రీనివాసాచార్యులు, పద్మనాభాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, వంశీకృష్ణమాచార్యులు, రాజేష్, మేళ్లచెరువులో ఎస్‌ఐ పరమేష్, ఆలయ మేనేజర్ కొండారెడ్డి, అర్చకులు శివవిష్ణువర్దన్ శర్మ, ధనుంజయశర్మ తదితరులు పాల్గొన్నారు.



మట్టపల్లి ఆలయంలో న్యాయమూర్తులకు ఆశీర్వచనం చేస్తున్న అర్చకులు



బీసీల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

- మంత్రి పొన్నం ప్రభాకర్
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో కలిసి జ్యోతిరావుపూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాల ఆవిష్కరణ



నల్లగొండలో పూలే దంపతుల విగ్రహాలను ఆవిష్కరిస్తున్న మంత్రులు పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, చిత్రంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్

నల్లగొండ : రాష్ట్ర ప్రభుత్వం బీసీల అభివృద్ధికి పెద్దపీట వేస్తోందని రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. శనివారం నల్లగొండలోని హైదరాబాద్ రోడ్డులో బీసీ సంక్షేమ భవన్ వద్ద ఏర్పాటు చేసిన జ్యోతిరావుపూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాలను రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితోకలిసి ప్రారంభించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో మంత్రి పొన్నం మాట్లాడుతూ మహిళలు చదవకూడదన్న మూఢ నమ్మకాలు ఉన్న రోజుల్లో సావిత్రీబాయి పూలే మహిళల చదువుల కోసం ఎంతో కృషి చేసి పాఠశాలలు స్థాపించారన్నారు. ఆమె జీవిత చరిత్రను ప్రతి ఒక్కరు చదవాలన్నారు. బీసీ సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని.. అందులో భాగంగా బీసీ కార్పొరేషన్లకు నిధులు మంజూరు చేశామని తెలిపారు. కులగణన చేపట్టేందుకు రూ.150 కోట్లు కేటాయించామన్నారు. కుల వృత్తులను ప్రోత్సహించడంతో పాటు ఆర్థిక పరిపుష్టిని కల్పిస్తామన్నారు. గురుకులాల విద్యార్థులకు మంచి సౌకర్యాలు కల్పించడంతో పాటు ఉద్యోగ నియామకాలు చేపట్టామన్నారు. మహనీయుల ఆశయాల కనుగుణంగా ప్రతి ఒక్కర్ని విద్యావంతులను చేయడమే తమ ఉద్దేశమన్నారు. అమర వీరుల కుటుంబాలకు త్వరలో పింఛన్లు అందించడంతో పాటు 250 గజాల స్థలం ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

విద్యార్థులకు అండగా నేనున్నా : మంత్రి కోమటిరెడ్డి

ఆర్థిక ఇబ్బందులతో చదువులు మానేసే విద్యార్థులు అండగా నేనున్నానని మరిచిపోవద్దని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. నేను ఇప్పటికే వందలాది మంది పేద విద్యార్థులను ఇంజనీర్లు, డాక్టర్లుగా చదివిస్తున్నానని.. ఏ ఒక్క విద్యార్థి ఆర్థిక ఇబ్బందులతో చదువుకు దూరం కావొద్దన్నారు. పురుషుడు చదివితే ఒక్కడికే ఉపయోగం.. మహిళ చదివితే కుటుంబం బాగుపడుతుందని విశ్వసించి మహిళలకు చదువు నేర్పించిన గొప్ప సంఘసంస్కర్త సావిత్రీబాయిపూలే అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో మొదటిసారి నల్లగొండ గడియారం సెంటర్‌లో జ్యోతిరావుపూలే విగ్రహం ఆవిష్కరించామన్నారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాసగౌడ్ మాట్లాడుతూ గత ప్రభుత్వం బీసీలను విస్మరించిందని.. అందుకే ఆయన్ను ఇంటికి పంపి కాంగ్రెస్‌ను గెలిపించడంలో బీసీలు ముఖ్యపాత్ర పోషించారని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి డిక్లరేషన్‌కు కట్టుబడి ఉండాలన్నారు. బీసీ గణన చేపట్టి పంచాయతీరాజ్ ఎన్నికలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చక్రహరి రామరాజు, అదనపు కలెక్టర్ పూర్ణచందర్, మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్, నాయకులు సోమ మల్లయ్య, కాశయ్యగౌడ్, మాజీ జెడ్పీటీసీ వంగూరి లక్ష్మయ్య, కాసోజు విశ్వనాథం, కౌన్సిలర్ భాస్కర్, నేలపట్ల సత్యనారాయణ, నేలపట్ల రమేష్, ఇంద్రయ్య, వంగూరి విజయకృష్ణ, కేశబోయిన శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌జీటీలను రిలీవ్ చేయాలి

నల్లగొండ: బదిలీ అయిన సెకండరీ గ్రేడ్ టీచర్ల(ఎస్‌జీటీల)ను రిలీవ్ చేయాలని డీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.సోమయ్య డిమాండ్ చేశారు. శనివారం నల్లగొండలోని సంఘం కార్యాలయంలో ఆ జిల్లా అధ్యక్షుడు ఎండీ.ఖుర్షిద్ మియా అధ్యక్షతన జరిగిన సమావేశంలో సోమయ్య మాట్లాడారు. మిగిలిన ఖాళీలకు వెంటనే పదోన్నతులు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. సర్వీస్ రూల్స్ సవరించి ఉపాధ్యాయులను జూనియర్ లెక్చరర్లుగా, డైట్ లెక్చరర్లుగా పదోన్నతి కల్పించాలని కోరారు. సమావేశంలో డి.గణేష్, బి.వెంకటేశం, ఎం.నాగయ్య, పి.ఏడుకొండలు, టి.వెంకటేశ్వర్లు, వై.మోహన్‌రావు, అంజయ్య, కె.వీరయ్య తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సోమయ్య

నార్కట్‌పల్లి డిపోకు పూర్వ వైభవం తెస్తాం

నల్లగొండ రూరల్ : నార్కట్‌పల్లి బస్ డిపోకు పూర్వ వైభవం తీసుకొచ్చి అన్ని ప్రాంతాలకు బస్‌లు నడిపేలా చర్యలు తీసుకుంటామని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శనివారం నల్లగొండ ఆర్టీసీ బస్టాండ్‌లో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో కలిసి రాజధాని ఏసీ బస్, నాలుగు డీలక్స్, ఒక పల్లెవెలుగు బస్‌లను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం మాట్లాడుతూ ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని 7 డిపోల నుంచి రోజు 645 బస్‌లు 2.55 లక్షల కిలోమీటర్లు ప్రయాణించి 3 లక్షల మంది ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చుతోందన్నారు.



నల్లగొండలో జెండా ఊపి బస్సును ప్రారంభిస్తున్న మంత్రులు పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి

మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండు రోజుల్లోనే మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఉచిత బస్ ప్రయాణం కల్పించినట్లు తెలిపారు. అప్పుల్లో ఉన్న ఆర్టీసీకి రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాలుగా సహకారం అందిస్తోందన్నారు. అనంతరం కనగల్ మండలానికి చెందిన పలువురికి మంత్రి కోమటిరెడ్డి కల్యాణలక్ష్మి చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పూర్ణచందర్, ఆర్‌ఎం రాజశేఖర్, మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్, డిప్యూటీ ఆర్‌ఎం శివశంకర్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి, కనగల్ మాజీ జెడ్పీటీసీ నర్సింగ్ శ్రీనివాస్‌గౌడ్, మున్సిపల్ మాజీ చైర్మన్ బొడ్డుపల్లి లక్ష్మి, అనూప్‌రెడ్డి, కూసుకుంట్ల రాజిరెడ్డి, పలువురు కౌన్సిలర్లు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ఆషాఢం ప్రత్యేకం



ఇంటింటా గోరింట పంట

- ఆషాఢ మాసంలో గోరింటాకు సందడి
- పూర్వ సంప్రదాయాన్ని కొనసాగిస్తున్న మహిళలు



గోరింటాకు పెట్టుకుంటున్న మహిళ

రామగిరి(నల్లగొండ): ఆషాఢమాసం వచ్చిందంటే చాలు ఏ ఇంట్లో చూసినా గోరింటాకు సందడి కనిపిస్తుంది. అతివల చేతులు గోరింటాకుతో మెరిసిపోతుంటాయి. ఏళ్ల నుంచి వస్తున్న ఈ సంప్రదాయాన్ని ఇప్పటికీ పాటిస్తూనే ఉన్నారు. తెలుగు లోగిళ్లలో పండుగ అయినా, పబ్బమైనా అమ్మాయిల చేతులు, కాళ్ల గోరింటాకు తప్పనిసరి. పెళ్లికాని యువతి చేతికి గోరింటాకు ఎర్రగా పండితే, మంచి భర్త వస్తాడని చెబుతుంటారు. ఎన్నో ఔషధ గుణాలున్న గోరింటాకు వేడుకలు ఈ ఆషాఢమాసంలో ఉత్సాహంగా సాగుతున్నాయి.

శరీరంలోని ఉష్ణాన్ని తగ్గిస్తుంది..

గోరింటలో ఔషధ గుణాలు దాగి ఉన్నాయని చెబుతుంటారు. గ్రీష్మరుతువులో మన శరీరంలో వేడి ఎక్కువగా ఉంటుంది. ఆషాఢం నాటికి వాతావరణం చల్లబడుతుంది. వాతావరణంలో వచ్చే ఈ మార్పు వల్ల వ్యాధులు వస్తుంటాయి. గోరింటాకుకు ఒంట్లో వేడిని తగ్గించే గుణం ఉంటుంది. బయటి వాతావరణానికి అనుగుణంగా మన శరీరాన్ని చల్లబరిచి రోగాల బారిన పడకుండా చేస్తుంది. అందుకే ఆషాఢంలో గోరింటాకును అరచేతిలో, పాదాలకు పెట్టుకుంటారు.



గోరింటాకు దంచుతున్న మహిళలు

కొత్త పెళ్లి కూతురికి సౌభాగ్యం..

ఆషాఢంలో కొత్త పెళ్లి కూతురు తమ పుట్టింటికి చేరుకోవడం ఆనవాయితీ ఆ సమయంలో తమ చేతులకు పండించుకునే గోరింటాకు తమ సౌభాగ్యాన్ని గుర్తు చేస్తుంది. పుట్టింటిలో ఉన్న వధువు.. మెట్టినింట ఉన్న భర్త ఆరోగ్యాన్ని కాంక్షిస్తుంది.

పూర్వం నుంచి వస్తున్న ఆచారం



ఆషాఢంలో గోరింటాకు పెట్టుకోవడం పూర్వం నుంచి వస్తున్న ఆచారం. ప్రస్తుతం యువతకు ఇది ఒక ఫ్యాషన్‌గా మారిపోయింది. నేడు గోరింటాకు చెట్టు కనుమరుగు అవుతుండడంతో కోన్‌లకు ప్రాధాన్యమివ్వాల్సి వస్తోంది.

– గందూరి ఉమ, వీటి కాలనీ

ఇష్టపడని వారు ఉండరు



మెహందీ అంటే ఇష్టపడని మగువలు ఉండరు. పసి పిల్లలు మొదలుకొని ముసలివారి వరకు ప్రతిఒక్కరూ మైదాకును ఇష్టపడతారు. ప్రస్తుత కాలంలో కోన్లు వచ్చినా.. ఆషాఢ మాసంలో మాత్రం గోరింటాకును నూరి చేతులకు పెట్టుకుంటారు.

కాచం శోభరాణి, కామేశ్వర్‌రావు కాలనీ

శరీరానికి చక్కటి ఔషధం



గోరింటాకులో మంచి ఔషధ గుణాలు ఉన్నాయి. ఇది పూర్వం నుంచి వస్తున్న సాంప్రదాయం. వాతావరణంలో జరుగుతున్న మార్పుల వల్ల సంభవించే శరీర రుగ్మతలను తొలగించే చక్కటి ఔషధం.

– దొంతం పుష్ప, రాక్‌హిల్స్ కాలనీ

చిన్ననాటి నుంచి కొనసాగిస్తున్నా..



నాకు ఊహ తెలిసిన నాటి నుంచి ప్రతి ఆషాఢంలో గోరింటాకు పెట్టుకుంటున్నాను. ఆషాఢం వచ్చిందంటే మా ఇంట్లో అక్క చెల్లెళ్లు అందరం కలిసి గోరింటాకు పెట్టుకునే వాళ్లం.

– బందారు కళ, లక్ష్మినగర్ కాలనీ



గోరింటాకు వేడుకల్లో పాల్గొన్న మహిళలు

తండాల్లో సీత్లా సందడి



ఇత్తడి పాత్రలో నవధాన్యాలు తీసుకెళ్తున్న గిరిజన యువతి

- ఏటా ఆషాఢ మాసంలో జరుపుకోవడం ఆనవాయితీ
- మొదటి, రెండో మంగళవారాల్లో వేడుకలు
- ఇప్పటికే కొన్నితండాల్లో పూర్తి
- రెండో వారానికి సిద్ధమవుతున్న మిగతా తండాలు



రామన్నగూడెంతండాలో పూజలు చేసిన సీత్లా భవాని విగ్రహాలు

సండే స్పెషల్

అర్వపల్లి: ఆషాఢ మాసం వచ్చిందంటే గిరిజన తండాల్లో సీత్లా పండుగ సందడి నెలకొంటుంది. గిరిజనుల ఆరాధ్య దైవమైన సీత్లా భవాని పండుగను ప్రతిఏటా ఆషాఢ మాసంలో మొదటి, రెండో మంగళవారాల్లో జరుపుకోవడం ఆనవాయితీ. ఇప్పటికే అధిక శాతం తండాల్లో సీత్లా భవాని పండుగ జరుపుకోగా.. మిగతా తండాల్లో వచ్చే మంగళవారం జరుపుకునేందుకు సిద్ధమవుతున్నారు. ప్రధానంగా ఈనెలలో వ్యాధుల ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో అందరూ బాగుండాలని తమ ఇష్ట దేవతను వేడుకుంటూ గిరిజనులు ఈ పండుగను జరుపుకుంటారు. అలాగే వర్షాలు సమృద్ధిగా కురవాలని.. పాడిపంటలు బాగా పండాలని.. పశువులు, జీవాలు రోగాల బారిన పడకుండా చూడాలని కోరుతూ సీత్లా భవాని(దాటుడు) పండుగ ప్రతి తండావాసులు చేసుకోవడం పరిపాటి. ఈ పండుగకు పెళ్లై అత్తారింటికి వెళ్లిన ఆడపడుచులను తమ ఇళ్లకు తీసుకురావడం ఓ ప్రత్యేకతగా చెప్పుకోవచ్చు.

పండుగ ఆచారం ఇలా..

గిరిజనులు తమ తండాల్లోని పొలిమేరల్లో గల పొలాల వద్ద సీత్లా భవాని విగ్రహాలను ఏర్పాటు చేసి అంతా అక్కడికి వెళ్లి పూజిస్తారు. తమ ఆచార సంప్రదాయల ప్రకారం నవధాన్యాలు, నీళ్లను ఇత్తడి పాత్రల్లో పోసి కొత్త దుస్తులు ధరించిన గిరిజన మహిళలు వాటిని తలపై పెట్టుకొని ఆటాపాటలతో ఊరేగింపుగా అమ్మవారి సన్నిధికి వెళతారు. ఈ క్రమంలో ప్రతి ఇంటి నుంచి ఒక కోడిని పట్టుకెళ్తారు. అలాగే యాటలను బలి ఇచ్చి మొక్కులు తీర్చుకుంటారు. వాటి రక్తంతో కలిపి నవధాన్యాలు, యాటల పేగులను అమ్మవారి విగ్రహాలకు వేసి వాటిపై పశువులు, జీవాలను దాటిస్తారు. తద్వారా పశువులు, జీవాలు ఎలాంటి రోగాల బారిన పడకుండా ఉంటాయని గిరిజనుల నమ్మకం. ఈ ప్రదేశంలోనే తమ ఆచారాల ప్రకారం పూజలు చేస్తారు. నవధాన్యాలు, బెల్లంతో చేసిన నైవేద్యాన్ని అమ్మవారికి సమర్పిస్తారు. మొక్కులు పూర్తయ్యాక అమ్మవారి వద్ద కోసిన యాటలు, కోళ్లను వండుకొని తింటారు. అలాగే వచ్చేనెల మొదటి వారంలో జరిగే తీజ్ వేడుకలకు గిరిజనులు సిద్ధమవుతున్నారు.



రామన్నగూడెంలో సీత్లా పండుగ బోనాల ఊరేగింపులో మహిళలు, యువతులు

ఆటాపాటలతో సంతోషంగా జరుపుకుంటాం



ఆషాఢ మాసంలో మొదటగా ఈ సీత్లా భవాని పండుగను ఎంతో సంతోషంగా జరుపుకుంటాం. ఉదయాన్నే కొత్త దుస్తులు ధరించి ఇత్తడి పాత్రల్లో నవధాన్యాలు, నీటిని తీసుకొని సంప్రదాయం ప్రకారం నృత్యాలు చేస్తూ ఊరేగింపుగా ఊరి పొలిమేరకు వెళ్లి అమ్మవారిని పూజిస్తాం.

– రమావత్ అనిత, నాన్యతండ, జాజిరెడ్డిగూడెం మండలం

భక్తిశ్రద్ధలతో పూజలు చేస్తాం



సీత్లా భవాని వేడుకలను ఎంతో భక్తిశ్రద్ధలతో జరుపుకుంటాం. పండుగ ప్రదేశంలో నవధాన్యాలు, రక్తం కలిపి చల్లి పూజలు చేస్తాం. అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించే వరకు ఏమి తినకుండా ఉంటాం.

– పాతులోతు అనుశ్రీ, లచ్చిరాంతండా, జాజిరెడ్డిగూడెం మండలం

గిరిజనులకు ఈ పండుగ ఎంతో ప్రధానమైనది



గిరిజనులకు ఈ పండుగ ఎంతో ప్రధానమైనది. ఎంత దూరంలో ఉన్న ఆడపిల్లలనైనా ఈ పండుగకు ఇంటికి తీసుకొస్తాం. ప్రతి తండా పొలిమేరల్లో ఈ పండుగ రోజు సీత్లా భవాని విగ్రహాలను నెలకొల్పి గిరిజనులందరు ఒకే చోట కలిసి జరుపుకోవడం ఆనవాయితీ.

– రమావత్ లాలునాయక్, బంజార సంఘం నాయకుడు

పీడీఎస్ బియ్యం తరలింపు కేసులో ఇద్దరికి రిమాండ్

మిర్యాలగూడ అర్బన్: పీడీఎస్ బియ్యం తరలింపు కేసులో ఇద్దరు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర రాజు తెలిపారు. శనివారం స్థానిక డీఎస్పీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 5వ తేదీన హుజూర్‌నగర్ నుంచి వాడపల్లి మీదుగా పీడీఎస్ బియ్యం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి తరలిస్తుండగా వాడపల్లి పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేసి అందుకు కారణమైన వారిని రిమాండ్‌కు తరలించామని, అదే కేసులో రేషన్ బియ్యం వ్యాపారం చేసే దాచేపల్లి గ్రామానికి చెందిన కల్లూరి లింగయ్య, జోగుపర్తి ముక్కటీశ్వర్‌రావు అలియాస్ ముక్కంటిలను శనివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

నాగారం: నాలుగు క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టుకున్నట్లు ఎస్ఐ వెంకట్‌రెడ్డి తెలిపారు. ఆలేరు మండలానికి చెందిన మాలోతు వినోద్, తిరుమలగిరి మండలం వెలిశాలకు చెందిన కార్తీక్ నాగారం మండలంలో సుమారు నాలుగు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి పసునూర్ నుంచి భువనగిరికి తరలిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. ఈమేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో యువకులకు గాయాలు

భూదాన్‌పోచంపల్లి : పట్టణ పరిధిలోని జీబీఆర్ గార్డెన్స్ సమీపంలో శనివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్ మెట్‌కు చెందిన రాము, నిఖిల్, సమీర్ అనే ముగ్గురు యువకులు స్కూటీపై జూలూరు నుంచి పోచంపల్లి వైపు వస్తుండగా జీబీఆర్ గార్డెన్ సమీపంలోకి రాగానే మూలమలుపు వద్ద ఎదురుగా వస్తున్న కారును తప్పించబోయి స్కూటీ అదుపుతప్పి కింద పడింది. ఈ ప్రమాదంలో నిఖిల్, సమీర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే క్షతగాత్రులను స్థానికులు చికిత్స నిమిత్తం 108అంబులెన్స్‌లో హైదరాబాద్‌కు తరలించారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తికి గాయాలు

వలిగొండ: మండలంలోని టేకులసోమారం సమీపంలో శనివారం ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. 108 సిబ్బంది, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వర్కట్‌పల్లికి చెందిన బంగారి భిక్షపతి టీవీఎస్ మోపెడ్‌పై టేకులసోమవారం వెళ్తున్నాడు. భువనగిరి నుంచి నల్లగొండకు వెళ్తున్న ఆర్టీసీ బస్సు భిక్షపతి వాహనాన్ని ఢీకొనడంతో అతడికి తీవ్రగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే 108కు సమాచారం ఇచ్చారు. చికిత్స నిమిత్తం భువనగిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ఇరువర్గాల బైండోవర్

హుజూర్‌నగర్‌రూరల్: మండలంలోని అమరవరంలో పీర్ల పండుగ విషయంలో ఇతర కులాలు, ముస్లింలకు వాగ్వాదం నెలకొంది. దీంతో గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఇరువర్గాలను శనివారం తహసీల్దార్ వద్ద పోలీసులు బైండోవర్ చేశారు. గ్రామంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

విద్యుదాఘాతంలో పాడిగేదె మృతి

మఠంపల్లి: మండలంలోని చౌటపల్లిలో వల్లపుదాసు మట్టయ్యకు చెందిన పాడిగేదె శనివారం విద్యుదాఘాతంతో మృతిచెందింది. బాధితుడు మట్టయ్య తెలిపిన వివరాల ప్రకారం.. ఉదయం పొలాల వద్దకు మేతకు వెళ్లిన గేదె తెగిపడి ఉన్న విద్యుత్ తీగకు తగలడంతో విద్యుత్‌షాక్ గురై అక్కడికక్కడే మృతి చెందింది. రూ.50వేల నష్టం జరిగిందని ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు కోరుతున్నాడు.

గుండెపోటుతో మాజీ ఎంపీపీ మృతి

- ఇటీవలే పదవీ విరమణ.. అంతలోనే అనంతలోకాలకు
- యువ ఎంపీపీగా ప్రజలతో మమేకం
- తాండ్ర అమరావతి మరణంతో మరిపడిగలో విషాదఛాయలు



అమరావతి (ఫైల్)

గుండాల : యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల మాజీ ఎంపీపీ తాండ్ర అమరావతి శనివారం గుండెపోటుతో మృతి చెందారు. శనివారం ఉదయం బాత్‌రూమ్‌కు వెళ్లిన అమరావతి.. అకస్మాత్తుగా అందులోనే పడిపోయారు. గమనించిన భర్త శోభన్ బాబు ఆమెను బయటకు తీసుకువచ్చి సీపీఆర్ చేస్తూనే ఆర్ఎంపీ వైద్యునికి సమాచారం అందజేశారు. ఆర్ఎంపీ వైద్యుడు కూడా కాసేపు సీపీఆర్ చేసినప్పటికీ పరిస్థితి అదుపులోకి రాకపోవడంతో జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించారు. వైద్యులు ఆమెను పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. అమరావతి 4 జూలై 2019 నుంచి 3 జూలై 2024 వరకు ఎంపీపీగా కొనసాగారు. అమరావతి మరణంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

కుటుంబ నేపథ్యం

జనగామ జిల్లా దేవరుప్పుల మండలం మాదాపురం గ్రామానికి చెందిన బెజిగం సోమక్క, రాములు దంపతుల రెండో కూతురు అమరావతి. గుండాల మండలం మరిపడిగ గ్రామానికి చెందిన తాండ్ర లలిత, యాదగిరి దంపతులు నాలుగో సంతానమైన తాండ్ర శోభన్‌బాబుకు ఇచ్చి 2016లో వివాహం జరిపించారు.మృతురాలి తల్లిదండ్రులు వ్యవసాయ కూలీలుగా జీవనం సాగిస్తున్నారు.

రాజకీయ ప్రస్థానం

అమరావతి మామ తాండ్ర యాదగిరి మరిపడిగ గ్రామ సర్పంచ్‌గా 1981నుంచి 1985 వరకు కొనసాగారు. ఆయన కాంగ్రెస్ పార్టీ నుంచి సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. 2018లో అప్పటి ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి సమక్షంలో అమరావతి, శోభన్‌బాబు దంపతులు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. 2019లో జరిగిన ప్రాదేశిక ఎన్నికల్లో మరిపడిగ స్థానం నుంచి అమరావతి ఎంపీటీసీగా పోటీచేసి గెలుపొందారు. అనంతరం గుండాల మండల ఎంపీపీగా బాధ్యతలు స్వీకరించారు. యువ ఎంపీపీగా ఐదేళ్ల పాటు అనునిత్యం ప్రజలతో మమేకమై వారి మన్ననలు పొందారు. అమరావతి జనగామ జిల్లాలోని ఏబీవీ కళాశాలలో డిగ్రీ పూర్తి చేశారు.



అమరావతి పార్థివదేహానికి నివాళులర్పిస్తున్న ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య తదితరులు

ముగిసిన అంత్యక్రియలు

అమరావతి పార్థివదేహానికి ఆమె స్వగ్రామమైన మరిపడిగలో సాయంత్రం 7 గంటలకు అంత్యక్రియలు నిర్వహించారు. కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు, వివిధ పార్టీల కార్యకర్తలు కన్నీటి వీడ్కోలు పలికారు. ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, మాజీ ఎమ్మెల్యేలు గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి, బూడిద భిక్షమయ్యగౌడ్, డీసీసీ అధ్యక్షుడు అండెం సంజీవరెడ్డి అమరావతి పార్థివదేహానికి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. నివాళులర్పించిన వారిలో రేషన్ డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎలుగల రాజయ్య, రాష్ట్ర కార్యదర్శి కందుల శంకర్, జిల్లా కార్యదర్శి ఉమాదర్శన్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు నర్సిరెడ్డి, సరస్వతిఅశోక్, కిషన్, నగేష్, మాజీ ఎంపీపీ ద్యాప కృష్ణారెడ్డి, దుంపల శ్రీనివాస్, వెల్లంకి సోమనర్సింహారెడ్డి, ఇమ్మడి దశరథ గుప్తా, మహేశ్వరం మహేందర్‌రెడ్డి, మందడి రామకృష్ణారెడ్డి ఉన్నారు.

సాక్షి సండే క్లాసిఫైడ్స్

Education

EDUCATION

■ స్టెల్లా కాలేజ్ (ఉమెన్స్) విజయవాడలో B.Sc. ఫోరెన్సిక్ సైన్స్ / అగ్రికల్చర్ / AI & ML / మెడికల్ ఇమేజింగ్ (రేడియాలజీ); BBA - 3 సం॥ల కోర్సులు. అర్హత : ఇంటర్. UGC & కృష్ణా యూనివర్సిటీ గుర్తింపు. హాస్టల్ కలదు. సంప్ర : 84658 74867, 99121 78237 [V- 2624]

■ ఓపెన్ 10th, ఇంటర్, డిగ్రీ, డిప్లొమా, PG, అక్టోబర్ పరీక్షల్లో 100% పాస్ గ్యారంటీ. 10th, ఇంటర్ ఫెయిల్ అయితే రీకౌంటింగ్ ద్వారా పాస్. ఫైన్‌తో అడ్మిషన్స్ కలవు. ఫోన్: 8019383310 [H-796129]

Real Estate

PLOT FOR SALE

■ సాగర్ హైవే (యాచారం) దగ్గరలో DTCP & RERA అప్రూవ్డ్ శివనంది వెంచర్‌లో ఓపెన్ ప్లాట్స్, ఫార్మాసిటీ భూములను, IT సంస్థలు మరియు పరిశ్రమలకు ప్రభుత్వం బదిలీ చేయనుంది. సాగర్ రోడ్ to అమరావతి Fastage రోడ్ ప్రపోజల్. డైరెక్ట్ కస్టమర్స్ ఓన్లీ. ఫోన్ : 9059088936, 8886082214. [HA-13697]

REAL ESTATE

■ MSR Developers కొరకు తెలంగాణ / ఆంధ్రాల్లో మార్కెటింగ్ సిబ్బంది కావలెను & మీరు ఉన్న ఏరియాల్లోనే లేఅవుట్ వెంచర్ ఫాం ల్యాండ్ పార్టనర్స్ కావలెను. ఫోన్: 8499940666 [H-189680]

Wanted

■ జెన్యూన్ VI కంపెనీలో వర్క్ చేయుటకు ఇంటర్/డిగ్రీ చేసిన స్త్రీ పురుషులు కావలెను. ఫీజులేదు. పార్ట్‌టైం: 15వేలు,ఫుల్‌టైం:30 వేలు కాల్/వాట్సాప్: 9652043585/ 8247014977 [G-801081]

■ 10th, ఇంటర్, డిగ్రీ, ITI, డిప్లొమా (P/F) చదివి ఖాళీగా వున్న 49 స్త్రీ/పులకు మా సంస్థలో జాబ్స్ కలవు. జీతం: 14వేలు+DA6వేలు+ఫ్రీరూం, భోజనం. నల్గొండ. సం.ప్ర: 8519891505. [L-796494]

■ We are hiring Cashier-1, Demo Sales Executives-4, Team Lead-1, Showroom Sales Manager-3, Tele Callers-2, Sales Executives-3, Service Mechanic-1, Water Wash Person-1, Helper-1, Arvee TVS Showroom DVK Road, Nalgonda. Cell : 6304112776, 9985934694 [Y-798339]

■ పనివారు కావలెను. హైదరాబాద్, బెంగళూరులో ఉండి ఇంటిపని, వంటపని, వృద్ధుల సేవ, పిల్లల పోషణకు స్త్రీలు, కావలెను. సంప్ర॥ 9391912949, 040-40123376. [H-800428]

■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. వీక్లీ పేమెంట్స్ 3500/- మీ పేరు, అడ్రస్ కాల్/ వాట్సప్ చేయగలరు. 95026 15217 [M-1185351]

■ వ్యవసాయ అనుభవం ఉన్నసూపర్‌వైజర్స్ & కర్ణాటక, మహారాష్ట్రలో పని చేయుటకు లిఫ్ట్ ఇరిగేషన్‌లో అనుభవం ఉన్న సూపర్‌వైజర్స్ కావలెను. సంప్రదించండి: PVC PROJECTS. Call: 040-23338080 (Monday-Saturday 10am- 6pm), Email: frontdesk.vineela@gmail.com [H-796131]

■ HYD లోని ప్రముఖ దేవాలయం (రామాలయం)లో పనిచేయుటకు అనుభవం గల శ్రీవైష్ణవ/బ్రాహ్మణ అర్చకులు కావలెను. మంచి జీతం + వసతి CV TO: 9885362832 [H-189693]

ప్రకటన గోరంత! స్పందన కొండంత!!
సాక్షి క్లాసిఫైడ్స్
ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు
నాలుగు లైన్లకు రూ. :220/- (Black & White)
అదనపు లైనుకు రూ.: 50/- మాత్రమే
5% GST అదనం
వివరాలకు
నల్లగొండ : 9912220737, 9010080143, 9010002038
మిర్యాలగూడ : 9666021744
నకిరేకల్ : 9010178203
సూర్యాపేట : 9912220740 9010038110
కోదాడ : 9010046033
భువనగిరి : 9010073592

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ముందస్తు వైద్య పరీక్షలతోనే ఆరోగ్యానికి రక్ష



మాట్లాడుతున్న ప్రొఫెసర్ కోదండరాం

వలిగొండ : ముందస్తుగా వైద్యపరీక్షలు చేయించుకోవడంతో ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవచ్చని టీజేఎస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. శనివారం మండలంలోని దుప్పెల్లి గ్రామంలో బాబు జమాల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గ్రామస్తుల సౌకర్యార్థం సమకూర్చిన అంబులెన్స్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజలు ఆరోగ్య రక్షణపై అవగాహన కలిగి ఉండి ఎప్పటికప్పుడు వైద్యపరీక్షలు చేయించుకుంటూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. పంటపొలాల సంరక్షణ కోసం విపరీతమైన పురుగు మందులు, రసాయనాలు వాడుతూ పంటలను పండిస్తున్నామని, విషరసాయనాలతో కూడిన పంటలు తింటున్నంత కాలం మన ఆరోగ్యానికి భద్రత లేదని, సేంద్రియ పద్ధతుల్లో పండించిన పంటలను ఆహారంగా తీసుకొని ఆరోగ్యం కాపాడుకోవాలన్నారు. ప్రభుత్వం గ్రామాలాభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తుందన్నారు. ప్రభుత్వం చేపట్టే అభివృద్ధి సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని గ్రామస్తులకు సూచించారు. కార్యక్రమంలో మాజీ మండల విద్యాధికారి గంధం వెంకన్న, జావేద్, సలీమ్, నరిగే యాదయ్య, బాలగోని సత్యనారాయణ, భిక్షపతి, ఎల్లంకి మహేష్, దేశపాక శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణగిరి శ్రీవారికి వసంతోత్సవ సేవ



శ్రీవారికి వసంతోత్సవ సేవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న పండితులు

భువనగిరి : పట్టణంలోని స్వర్ణగిరి శ్రీవేంకటేశ్వర స్వామి దేవాలయంలో శనివారం స్వామి వారికి ఉదయం వసంతోత్సవ సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. అంతకు ముందు ఉదయం పండితులు శ్రీవారికి తోమాలసేవ, ప్రత్యేక పూలతో అలంకరణ, తులసిదళాలు, పలు రకాల పూలతో సహస్రనామార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారిని ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి, ఉత్తరప్రదేశ్ రాష్ట్ర డీజీపీ ప్రిజాన్, ఐపీఎస్ రమాశత్రి దర్శించుకున్నారు.

భువనగిరికి చేరిన జగన్నాథ రథయాత్ర

భువనగిరి : ఇస్కాన్ సంస్థ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి నుంచి యాదగిరిగుట్ట వరకు నిర్వహిస్తున్న జగన్నాథ రథయాత్ర శనివారం భువనగిరికి చేరుకుంది. స్థానికులు రథయాత్రకు స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలోని ప్రధాన రహదారి మార్గంలో మహిళలు పెద్ద ఎత్తున కోలాటం ఆడుతూ పాటలతో రథం లాగుతూ యాదగిరిగుట్టకు వెళ్లారు. రథయాత్రలో విదేశీ మహిళలు కూడా పాల్గొన్నారు. రథయాత్రకు స్వాగతం పలికిన వారిలో మున్సిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చందా మహేందర్ గుప్తా, పోలా శ్రీనివాస్ గుప్త, సతీష్ ఉన్నారు.



రథయాత్రలో పాల్గొన్న విదేశీయులు

వస్త్ర నిల్వలు ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

భూదాన్‌పోచంపల్లి : చేనేత సహకార సంఘాలు, మాస్టర్‌వీవర్స్ వద్ద పేరుకుపోయిన చేనేత వస్త్ర నిల్వలను ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని ఉస్మానియా యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ కె. శ్రీనివాసులు కోరారు. శనివారం చేనేత జన సమాఖ్య ఆధ్వర్యంలో ఉస్మానియా యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ కె. శ్రీనివాసులు నాయకత్వంలో మాచర్ల మోహన్‌రావు, కె. జె.రామారావు, తడక యాదగిరి, చింతకింది రమేశ్‌ల బృందం కోయలగూడెం, సంస్థాన్‌నారాయణపురం, గట్టుప్పల్, పుట్టపాక, చండూరు, భూదాన్‌పోచంపల్లిని సందర్శించి చేనేత పరిశ్రమ ఎదుర్కొంటున్న సమస్యలపై అధ్యయనం చేశారు. ప్రధానంగా కార్మికులు, మాస్టర్ వీవర్స్ ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకొన్నారు. అనంతరం ఆయన పోచంపల్లి చేనేత సహకార సంఘంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ చేనేత కార్మికులకు చేతినిండా పనికల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపైన ఉందని అన్నారు. త్రిఫ్ట్ పథకంలో రాష్ట్ర ప్రభుత్వ వాటా ధనం సెప్టెంబర్ నుంచి రావల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలని అన్నారు. చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించి బలోపేతం చేయాలని అన్నారు. ప్రభుత్వం 40శాతం నూలుసబ్సిడీ వెంటనే పునరుద్ధరించాలని, అలాగే చేనేతపై జీఎస్టీని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో చేనేత నాయకులు ఏలే భిక్షపతి, చిక్క కృష్ణ, గంజి బస్వలింగం, కర్నాటి పురుషోత్తం, వేశాల మురళి, గజ్జెల రామకృష్ణ తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న రిటైర్డ్ ప్రొఫెసర్ శ్రీనివాసులు